
తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.89,500
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.8,098

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.98,700
రిటైల్ వెండి గ్రాము	రూ.101.70

క్లుప్తంగా

రేపు ఎస్వీయూలో జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టీ.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 50 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డీఫార్మసీ, బీఫార్మసీ, ఎమ్‌ఫార్మసీ చదివిన అభ్యర్థులు అర్హులని, ఆసక్తిగల వారు గురువారం ఉదయం 10గంటకు వర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9533889902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అటవీశాఖ భూముల్లోకి వస్తే చర్యలు


రికార్డులను పరిశీలిస్తున్న డీఆర్వో సుహాసిని

బాలాయపల్లి(సైదాపురం):అటవీశాఖ భూముల్లోకి వస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని డీఆర్ఓ సుహాసిని హెచ్చరించారు. బాలాయపల్లి మండలం, అలిమిలి గ్రామంలో సర్వే నం.4లో ఉన్న భూమి ఆక్రమణలపై రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సర్వే నం.4లో ఉన్న భూమిలో సగం వరకే అటవీశాఖకు సంబంధించిందని, ఆ భూముల్లోకి వస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్తులు మాట్లాడుతూ రెవెన్యూశాఖ అధికారులు అకారణంగా ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు వాపోయారు. ఫారెస్ట్ బీట్ అధికారి భవానిఅశోక్, రహంతుల్లా పాల్గొన్నారు.

క్రమశిక్షణ..విద్యతోనే వికాసం

తిరుపతి ఎడ్యుకేషన్ : క్రమశిక్షణతో కూడిన విద్యతోనే విద్యార్థులకు సంపూర్ణ వికాసం కలుగుతుందని ఎస్వీ వేదిక్ వర్సిటీ రిజిస్ట్రార్ పోకల భాస్కరుడు తెలిపారు. మంగళవారం తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యతోనే చక్కని సంస్కారం అలవడుతుందని వెల్లడించారు. తిరుపతి డీవైఈఓ కె.బాలాజీ మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలను చక్కగా రాసి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.సురేంద్రబాబు, రామకృష్ణారెడ్డి, శివకుమార్, బాలమందిరం వి.సుధాకర్, ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వెంకన్న రథోత్సవం


అశ్వవాహన సేవలో నటుడు మంచు మోహన్‌బాబు


గోవిందనామస్మరణతో స్వామివారి దివ్యరథాన్ని లాగుతున్న భక్తులు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజైన మంగళవారం స్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతంగా దివ్యరథాన్ని అధిరోహించి భక్తులకు దర్శనం ఇచ్చారు.

అశ్వ వాహనంపై వెంకన్న రాజసం

మంగళవారం రాత్రి స్వామి వారు అశ్వ వాహనంపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మితో పాటు ఆలయ సిబ్బంది తరపున స్వామి వారికి వివిధ రకాలైన పండ్లు, పూలను సమర్పించి, సర్కారు హారతిని అందుకున్నారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చక్రస్నాన కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 10 నుంచి 10.20 గంటల మధ్య ఆలయ పుష్కరిణిలో అర్చకులు వైఖానస ఆగమోక్తకంగా నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య జరిగే ధ్వజవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

మాజీ సైనికుని ఇంట్లో చోరీ


మాజీ సైనికుడు జగదీశ్వరనాయుడు ఇంటిని పరిశీలిస్తున్న సీఐ చిన్నగోవిందు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, గాంధీపురం పంచాయతీ, మిలటరీ కాలనీకి చెందిన మాజీ సైనికుడు జగదీశ్వరనాయుడు ఇంట్లో దొంగలు పడ్డారు. విలువైన బంగారం, వెండి వస్తువులు దోచుకెళ్లారు. ఈనెల 22వ తేదీ చిత్తూరులో తన కుమార్తె ఇంట జరిగిన శుభకార్యంలో పాల్గొనేందుకు జగదీశ్వరనాయుడు, తన భార్య భాగ్యలక్ష్మితో కలసి ఇంటికి తాళం వేసుకుని వెళ్లారు. తరువాత మంగళవారం తిరిగి ఇంటికి చేరుకోగా అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో ఇంట్లో దొంగలు పడ్డారని గుర్తించారు. అనంతరం పోలీసుల సమక్షంలో ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా అల్మారాలో బట్టల దగ్గర దాచిపెట్టిన ఒక తులం బంగారు కమ్మలు, మంచం కింద దాచిన రూ.70 వేలు నగదు, 500 గ్రాముల బరువు కలిగిన వెండి గ్లాసులు, దీపపు స్తంభాలు, వెండి పళ్లెం, కామాక్షి దీపం, వెండి పూల బుట్టలను దొంగలు దోచుకెళ్లినట్టు గుర్తించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపారు.

ముగిసిన క్రీడా సాంస్కృతిక సమ్మేళనం


సాంస్కృతిక విభాగంలో ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచిన తిరుపతి జోన్ ఉద్యోగులు

తిరుపతి సిటీ: ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల వేదికగా గత మూడు రోజులుగా ఉత్సాహంగా కొనసాగిన క్రీడా సాంస్కృతిక సమ్మేళనం మంగళవారం ముగిసింది. ఎన్జీరంగా వర్సిటీ పరిధిలోని సుమారు 5 కళాశాలల నుంచి విచ్చేసి అధ్యాపకులు పలు విభాగాల్లో జరిగిన క్రీడల్లోనూ, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభ చాటారు. కార్యక్రమానికి వర్సిటీ డీన్ డాక్టర్ కరుణాసాగర్, కళాశాల అసోసియేట్ డీన్ ఎంవీ రమణ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. మానసిక ఒత్తిడిని జయించడంలో క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధాన భూమిక పోషిస్తాయన్నారు. అధ్యాపకులు క్రీడలను తమ దినచర్యలో భాగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలని ఆకాంక్షించారు. పలు విభాగాల్లో జరిగిన క్రీడా పోటీల్లో వ్యవసాయ వర్సిటీకి చెందిన కృష్ణాజోన్ ఉద్యోగులు ఓవరాల్ చాంపియన్స్‌గా నిలువగా, సాంస్కృతిక విభాగంలో జరిగిన పోటీల్లో తిరుపతి జోన్ ఉద్యోగులు ఓవరాల్ చాంపియన్స్‌గా నిలిచారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సుమతి, కళాశాల విద్యార్థి వసతిగృహాల ఇన్‌చార్జ్ డాక్టర్ ఎంఎస్వీ చలం, పీడీ రవికాంత్‌రెడ్డి, రాష్ట్రంలోని పలు కళాశాల నుంచి విచ్చేసిన సుమారు 200 అధ్యాపకులు పాల్గొన్నారు.

పీ-4 సర్వే వేగవంతం


మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: పీ4 సర్వేను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. పీ4 సర్వే చేస్తున్న ఉద్యోగులకు మండల పరిధిలో ఎంపీడీఓలు, పట్టణ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో 0-6ఏళ్ల పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలన్నారు. ఆయుష్మాన్ భవ పథకం ప్రస్తుతం ఏబీహెచ్‌ఏ హెల్త్‌కార్డుగా మార్చారని, ఇందులో నమోదు చేసుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తింపజేస్తుందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కార్డును పొందాలని చెప్పారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్, డీపీఓ సుశీలాదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, సర్వేవిభాగం జిల్లా అధికారి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఫార్మా స్యూటికల్స్‌దే కీలకపాత్ర


వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: మానవుని ఆరోగ్య సంరక్షణలో ఫార్మా స్యూటికల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని వీసీ సీహెచ్ అప్పారావు తెలిపారు. ఎస్వీయూ ఫార్మసీ కళాశాల 8వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనుషుల ఆరోగ్యం కాపాడడంలో డాక్టర్ల తర్వాత ఫార్మాస్యూటికల్ విభాగందే కీలకం అన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడడంలో ఫార్మసీ విద్యార్థులు భాగస్వాములు కావడం భగవంతుడు కల్పించిన గొప్పవరమని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రిన్సిపల్ ఓవీఎస్ రెడ్డి, రవిశేఖర్ రెడ్డి, శరత్ బాబు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో బాలికకు తీవ్ర గాయాలు

- రుయాలో చికిత్స

తిరుపతి తుడా: ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడిన బాలికను బాధిత కుటుంబ సభ్యులు మంగళవారం తిరుపతి రుయాకు తరలించారు. రాపూరు సమీపంలోని కండిగుంటకు చెందిన 15 మంది శివభక్తులు సోమవారం కాలినడకన అటవీ మార్గంలో రైల్వే కోడూరు మీదుగా తలకోనకు బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో దట్టమైన అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు భక్తులపై దాడి చేసింది. ఈ దాడిలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా పలువురు తీవ్రగాయాలపాలయ్యారు. అందులో మహాలక్ష్మి (16) బాలికను చికిత్స నిమిత్తం రుయాకు తీసుకొచ్చారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

జింక మృతి


జింకను తరలిస్తున్న ఫారెస్ట్ సిబ్బంది

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. తిరుమల ఫారెస్ట్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి నుంచి తిరుపతికి వెళ్లే ఘాట్ రోడ్లోని ఏడో మైలు వద్ద గుర్తు తెలియని వాహనం జింకను ఢీకొట్టింది. దీంతో జింక అక్కడికక్కడే మృతిచెందింది. అధికారులు జింక కళేబారాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెటర్నరీ హాస్పిటల్‌కు తరలించారు.

ఉద్వాసన దిశగా అడుగులు

దీర్ఘకాలిక సెలవులో రుయా వైద్యులు

- 14 మందిని గుర్తించి నోటీసులు ఇచ్చిన అధికారులు
- అయినా స్పందించని డాక్టర్లు
- విధుల నుంచి తొలగింపునకు మొదలైన చర్యలు

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆస్పత్రిలో దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న ప్రభుత్వ వైద్యులను గుర్తించి ఉద్వాసన పలికే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 2023 లోనూ దీర్ఘకాలిక సెలవుల పై ఉన్న వైద్యులపై అప్పటి ప్రభుత్వం వేటు వేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వమూ అదే దారిలో నడుస్తోంది. ఇటీవల రుయాలోని 9 మంది వైద్యులను తొలగించారు. అలాగే మరో 14 మందికి ఈనెల 10వ తేదీన డీఎంఈ నోటీసులు జారీచేశారు. 15 రోజుల్లో అంటే 24వ తేదీలోపు వివరణ ఇవ్వాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. 14 మంది వైద్యుల్లో కేవలం ఇద్దరు మాత్రమే స్పందించారు. తాము సెలవు పై ఉండడానికి కారణాలను ప్రభుత్వానికి వివరించారు. మిగిలిన వారు స్పందించలేదు. వారిని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

స్పందించని వైద్యులు

రాష్ట్ర వ్యాప్తంగా దీర్ఘకాలిక సెలవు పై ఉన్న 91 మందిని గుర్తించారు. అందులో 11 మంది తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజ్, రుయాలో వైద్యులు ఉన్నారు. ఈనెల 10వ తేదీన వీరందరికీ నోటీసులు వెళ్లాయి. కొంతమంది వైద్యులు ఈ నోటీసులకు స్పందించకపోవడం సంచలనంగా మారింది. నోటీసులకు సమాధానం ఇవ్వకపోవడంతో అధికారులు డీఎంఈకి దీనిపై నివేదించారు. 14 మంది వైద్యుల్లో కేవలం ఇద్దరు మాత్రమే స్పందించగా.. మిగిలిన వారిని తొలగించడం అనివార్యంగా మారింది.

ఆ 14 మంది వీరే

ఎస్వీ మెడికల్ కళాశాలలో దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్న 14 మంది వైద్యుల వివరాలు ప్రభుత్వం వెల్లడించింది. ఇందులో చిన్నపిల్లల విభాగానికి చెందిన జీ.సాయిప్రసన్న, దిలీప్ సత్య, రామగణేష్, జనరల్ సర్జరీ విభాగానికి చెందిన అజయ్ బాబు, అజగముత్తు, న్యూరాలజీ విభాగానికి చెందిన గంటా రాజశేఖర్, నెఫ్రాలజీ విభాగానికి చెందిన డాక్టర్ పావని, ఓబీజీ విభాగానికి చెందిన తనూజ, గీతావాణి,వంశీ ప్రియ, మంజూయాదవ్, రేడియో థెరపీ విభాగానికి చెందిన ఆర్ముగం, జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన రంగనాథం, సైకియాట్రీ విభాగానికి చెందిన రాధాకృష్ణ రాజు ఉన్నారు.

భక్తులను మోసగిస్తే చర్యలు

తిరుమల: శ్రీవారి భక్తులను దర్శనాల పేరుతో మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు హెచ్చరించారు. టీటీడీ పీఆర్వో అని చెప్పుకుంటూ ప్రసాద్ అనే పేరుతో చెలామణి అవుతూ చైర్మన్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని తిరుమల సమాచారం అనే గ్రూప్ ద్వారా ఎన్ఆర్ఐ భక్తుల నుంచి శ్రీవారి దర్శన టికెట్ల ఆశజూపి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఎన్ఆర్ఐ భక్తుడు గోపాల్ రాజు చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో చైర్మన్ ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించారు. విజిలెన్స్ వింగ్ సిబ్బంది బాధితుడి నుంచి వివరాలు సేకరించారు. ప్రాథమిక విచారణలో నిందితుడు హైదరాబాద్ లోని ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జావేద్ ఖాన్ గా గుర్తించారు. ఈ మేరకు తిరుమల టూ టౌన్ పోలీసులు ఎఫ్ఐఆర్ నం. 18/2025తో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లోకేశా..ఇది కనిపించలేదా?


గత వీసీ శ్రీకాంత్‌రెడ్డిపై దాడి చేస్తున్న కూటమి నేతలు

తిరుపతి సిటీ: కూటమి అధికారంలో వచ్చిన మరుక్షణమే ఎస్వీయూలో అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు వీసీ చాంబర్‌లోకి చొరబడి అసభ్య పదజాలంతో దాడిచేశారు. అప్పటి వీసీ శ్రీకాంత్‌రెడ్డిపై వాటర్ బాటిళ్లు, ఫైళ్లను విసిరేస్తూ మీడియా సాక్షిగా దాడి చేసిన దృశ్యాలు ప్రసారమాధ్యమాల్లో ప్రచారమయ్యాయి. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు వర్సిటీ వీసీలపై జరిగిన దాడులపై గళమెత్తారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ సమాధానం ఇస్తూ సాక్ష్యాలు ఇవ్వండి విచారణ చేపడతామంటూ మాట్లాడడంపై నిపుణులు, విద్యావంతులు విస్మయం వ్యక్తం చేశారు. ఇందుకు ఎస్వీయూలో ఆరోజు జరిగిన ఘటన గుర్తులేదా మంత్రివర్యా...అంటూ పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

నేడు శివాలయాలకు చెవిరెడ్డి సారె

తిరుపతి రూరల్ : మహా శివరాత్రిని పురస్కరించుకుని తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి చంద్రగిరి నియోజకవర్గంలోని శివాలయాలకు ఏటా సారె సమర్పించడం ఆనవాయితీ. అందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బుధవారం ఉదయం 6 గంటలకు తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామికి సారె సమర్పించనున్నారు. అనంతరం ఆరు మండలాల్లోని అన్ని శైవాలయాలకు వెళ్లి సారె అందించనున్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి కల్చరల్ : బీసీ హక్కుల సాధనే లక్ష్యంగా మార్చి 12న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం దక్షిణ భారత అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి బీసీల హక్కుల కోసం పోరాటం చేస్తున్నా ప్రభుత్వాలు వివక్షతతో వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ,ఎస్టీ తరహాలో బీసీలకు రక్షణ చట్టం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నేతలు సుగుణ, షణ్ముగం, ఎం.రెడ్డెప్ప, జి.శ్రీనివాసులు, మల్లి, రెడ్డి శేఖర్ ,మహేస్, నాగసుబ్బయ్య, రఘురామ్, సుధాకర్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు


ఆలయం వెలుపల మంచు విష్ణు, శివబాలాజీ

తిరుమల : తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో సినీ నటుడు మంచు విష్ణు, శివబాలాజీ, ఎంపీ జైరామ్ రమేష్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు.

మహిళలకు రుణాల పంపిణీ

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు స్త్రీ శక్తి భవనములో మంగళవారం మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.1.50 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ సీమత్‌కుమార్ మాట్లాడుతూ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఆర్‌డీఓ వాసుమతి, అసిస్టెంటు సాయి, ఏపీఎం స్వర్ణలత, సీసీ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్లోరీ క్వీన్‌గా ఎన్ఎస్‌యూ విద్యార్థిని


గ్లోరీ ఫెస్టివల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఒడిశా రాష్ట్రంలోని పూరి పట్టణంలో ఇటీవల నిర్వహించిన గ్లోరీ ఫెస్టివల్-2025 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పలు సాంస్కృతిక పోటీల్లో జాతీయ సంస్కృత వర్సిటీ విద్యార్థులు ప్రతిభ కనబరచి ప్రథమ పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన కార్యక్రమంలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫోక్ డ్యాన్స్, స్కిట్, మోనోయాక్షన్, లైట్ మ్యూజిక్, ఓకల్, క్లాసిక్ డ్యాన్స్, ఇన్‌స్ట్రుమెంటల్ విభాగాల్లో వర్సిటీ విద్యార్థులు ప్రతిభ కనబరచి ప్రథమ స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. అలాగే గ్లోరీ క్వీన్‌గా సమన్విత కె నంబూతిరి ఎంపిక కావడం సంతోషకరమన్నారు.

అబాకస్‌లో ఆర్‌కే విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న సంస్థ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : కేటీ రోడ్డులోని ఆర్‌కే అబాకస్ విద్యార్థి రిషికేష్ రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించినట్లు సంస్థ డైరెక్టర్ ఆర్‌కే విమల తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆదిత్య లెర్న్‌టెక్ ఎడ్యుకేషన్ సంస్థ నిర్వహించిన పోటీల్లో రిషికేష అత్యుత్తమ ప్రతిభ చాటినట్లు వెల్లడించారు. ఈ మేరకు విద్యార్థి తల్లిదండ్రులు ఎర్రంశెట్టి సత్యనారాయణ, శైలజ మాట్లాడుతూ సంస్థ చైర్మన్ డాక్టర్ ఆర్‌కే రెడ్డి అందించిన శిక్షణ కారణంగానే రిషికేష్ రాణించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, బీజేపీ దక్షిణ మండల ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, కార్తీక్, ఈశ్వర్ పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : మంగళం ట్రెండ్స్, ఎమ్మార్‌పల్లె జెడ్పీ హైస్కూళ్లలో 6రోజులుగా 120మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి పేరుతో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఎంఈఓ భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ చిన్నారుల్లో జ్ఞానం, శారీరక అభివృద్ధి, బుద్ధి వికాసం, భాషాభివృద్ధి, సృజనాత్మకత, ఫ్రీ హ్యాండ్ డ్రాయింగ్, సామాజిక భావోద్వేగ అభివృద్ధిని పెంపొందించేందుకు అనువుగా అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీలు తయారుచేసి ప్రదర్శించిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ సుధారాణి, పాఠశాల హెచ్ఎం కేశవనాయుడు, రిసోర్స్‌పర్సన్లు ప్రభుకుమార్‌శెట్టి, వినోద్‌కుమార్, సీఆర్పీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

భాకరాపేట: అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు బోధనాభ్యసన సామగ్రి ఉపయోగించాలని చిన్నగొట్టిగల్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. అంగన్‌వాడీ శిక్షణలో ఆయన మాట్లాడుతూ పిల్లలకు సులువగా అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ- 2 గోపీనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని, డీఆర్పీలు శిరీష, భారతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రుణ దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ కమిషనర్ అమరయ్య

తిరుపతి తుడా : వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేయనున్న సబ్సిడీ రుణాలకు వచ్చిన దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలిస్తున్నట్లు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బ్యాంకు అధికారులతో కలిసి రెండు రోజులుగా కచ్చపి ఆడిటోరియంలో దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం విశ్వనాథ రెడ్డి, మెప్మా సూపరింటెండెంట్ గాలి సుధాకర్, సీఎంఎంలు కృష్ణవేణి, సోమకుమార్ పాల్గొన్నారు.

నేత్రదానం



అంగీకార పత్రం అందిస్తున్న మేరీ

తిరుపతి తుడా : వైఎస్సార్ కడప జిల్లా మిట్ట మనిపల్లెకు చెందిన చిన్న ఓబులపతి (36) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మంగళవారం రుయాలో మరణించారు. దీంతో ఆయన భార్య జే గ్రేస్ మేరీ మానవతా దృక్పథంతో తన భర్త నేత్రాలను దానం చేశారు. ఈ మేరకు రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, ఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణకు నేత్రదాన అంగీకార పత్రాలను అందజేశారు. రవిప్రభు మాట్లాడుతూ నేత్రదానానికి ముందుకు వచ్చేవారు 8500880126 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌తో ఉపాధి



మాట్లాడుతున్న ఎంపీఐ కుసుమ

తిరుపతి సిటీ : మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారిస్తే ఉన్నతంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని సీనియర్ ఎంవీఐ డాక్టర్ కుసుమ తెలిపారు. మంగళవారం పద్మావతి మహిళా వర్సిటీలో నిర్వహించిన మెకరేనా–2025కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీపై విద్యార్థినులు దృష్టి సారించాలన్నారు. వెహికల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఇంజిన్ కన్‌స్ట్రక్షన్‌లో నైపుణ్యం సాధించాలని సూచించారు. అనంతరం సాంకేతిక పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మల్లికార్జున, అధ్యాపకులు స్నేహలత, వెంకటేష్‌నాయక్, జోత్స్న పాల్గొన్నారు.

గజవాహనంపై అలమేలుమంగమ్మ



తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీదేవి ఆలయంలో ఉత్తరాషాడ నక్షత్రం సందర్భంగా మంగళవారం రాత్రి 7 గంటలకు అమ్మవారు గజ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అలమేలుమంగమ్మను పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

జాగరణకు వేళాయె!

- నేడు మహాశివరాత్రి
- ముస్తాబైన ఆలయాలు

తిరుపతి కల్చరల్ : మహాశివరాత్రి వేడుకలకు ఆలయాలను విశేషంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో నగరంలోని శ్రీకపిలేశ్వరస్వామి ఆలయం, దేవేంద్ర థియేటర్ సమీపంలోని శివాలయం, మంచినీళ్ల గుంట వద్ద శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి, విశాలాక్షి సమేత శారదా దేవి ఆలయం, ఎల్ఎస్ నగర్‌లోని భ్రమరాంబికా సమేత శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో విశేష ఏర్పాట్లు చేపట్టారు. ఉదయం 4 నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతించనున్నారు.

తిరుపతి రూరల్ : మండలంలోని పైడిపల్లి, సి.గొల్లపల్లి, చిగురువాడ, దుర్గసముద్రం, అడపారెడ్డిపల్లి, యోగిమల్లవరం, అవిలాల, మంగళం పంచాయతీల్లోని శివాలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. యోగిమల్లవరంలోని పరాశురామేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలను ప్రారంభించారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పట్టు వస్త్రాలు సమర్పించారు. నందీశ్వరుని ప్రదోష పూజలో పాల్గొన్నారు.

తలకోన(భాకరాపేట): మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తలకోన ఆలయంలో మంగళవారం ఉదయం ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించారు. రాత్రి నెరబైలు గ్రామంలో సిద్దేశ్వరి సమేత శ్రీ సిద్దేశ్వరస్వామివారికి వైభవంగా గ్రామోత్సవం జరిపించారు. ఈఓ జయకుమార్ పాల్గొన్నారు.

చంద్రగిరి : చంద్రగిరి తొండవాడ సమీపంలోని స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన శ్రీఅగస్తీశ్వర స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు.

తిరుపతి సిటీ : స్థానిక నరసింహ తీర్థం రోడ్డు మంచినీళ్లకుంట సమీపంలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు సూర్యనారాయణ శర్మ, సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు.



అశ్వవాహనంపై ఊరేగుతున్న కపిలేశ్వరస్వామి

కల్పవృక్షంపై కపిలవిభుడు

శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు మంగళవారం ఉదయం స్వామి వారు కల్పవృక్షవాహనం అధిరోహించి పురవీధుల్లో విహరించారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం అర్చకులు స్నపన తిరుమంజనం చేపట్టారు. శ్రీసోమస్కందమూర్తి, కామాక్షి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో అభిషేకం చేశారు. రాత్రి స్వామివారు అశ్వవాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శన మిచ్చారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మంచినీళ్ల గుంటలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం



ముస్తాబైన వల్మీకేశ్వరస్వామి ఆలయం



యోగిమల్లవరంలో ప్రదోషపూజలు



తలకోనలో ఆది దంపతులు



చంద్రగిరి : అన్నాభిషేకంలో దర్శన మిస్తున్న స్వామి వారు

కొట్టేస్తూ.. బొక్కేస్తూ!

పేదల నోటి కాడ కూడును లాగేస్తున్నారు. హాస్టల్ విద్యార్థుల కడుపు కొట్టేస్తున్నారు. ఇష్టారాజ్యంగా రేషన్ బియ్యం కాజేస్తున్నారు. యథేచ్ఛగా బ్లాక్ మార్కెట్‌లో అమ్మేస్తున్నారు. బడుగుల ఆకలి తీర్చే చౌక బియ్యంతో రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. నిరుపేద పిల్లల పొట్ట మాడ్చి తమ ఉదరాలను పెంచుకుంటున్నారు. పౌరసరఫరాలశాఖ గోడౌన్‌లోని ఓ అధికారి కొన్ని నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా మొత్తం వ్యవహారం నడిపిస్తున్నారు. కొంతమంది సిబ్బందితో కలిసి ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు.

- పక్కదారి పడుతున్న రేషన్ బియ్యం
- గోడౌన్‌లోనే కుదురుతున్న ఒప్పందం
- తూకాల్లో యథేచ్ఛగా మోసం
- ఇష్టారాజ్యంగా బ్లాక్ మార్కెట్‌లో విక్రయం

చంద్రగిరి : పేదలకు, ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల ఆకలి తీరుస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు రాబందులు బొక్కేస్తున్నారు. రేషన్ దుకాణాలతో పాటు హాస్టళ్లకు పంపిణీ చేసే బస్తాలను పదుల సంఖ్యలో దోచుకుంటున్నారు. అలాగే ఇతర సరుకులను సైతం ఆరగించేస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా కొద్ది నెలలుగా తతంగం సాగిస్తున్నారు. చంద్రగిరి మండలంలో 41 రేషన్ దుకాణాలతో పాటు 7 బీసీ, ఎస్సీ, ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు, హాస్టళ్లకు పంపిణీ చేస్తున్న బియ్యం, కందిపప్పు, చక్కెరను అందినంత వరకు స్వాహా చేస్తున్నారు..

గోడౌన్‌లోనే డీల్

రేషన్ దుకాణాలకు నిత్యవసరాలు పంపిణీ చేసే ముందే గోడౌన్‌లోనే అక్రమార్కులు డీల్ కుదుర్చుకుంటున్నట్లు సమాచారం. అక్కడ పనిచేసే ఓ అధికారి మరో వ్యక్తిని బినామీగా పెట్టుకుని వ్యవహారం నడిపిస్తున్నారు. కొంత మంది రేషన్ డీలర్లతో ఒప్పందం కుదుర్చుకుని బియ్యం బస్తాలతో పాటు చక్కెర, నూనె, పప్పు ఇతర నిత్యవసర సరుకులను దింపుకుంటున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ప్రతి బియ్యం బస్తాలో రెండు నుంచి మూడు కిలోల చొప్పున తగ్గించి పంపిణీ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలా పోగు చేసిన బియ్యమే నెలకు సుమారు 30 బస్తాలకు వరకు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

హాస్టళ్ల నుంచి భారీగా బదలాయింపు

చంద్రగిరి పట్టణంలో హాస్టళ్లకు ప్రతి నెలా గోడౌన్ నుంచి రేషన్ బియ్యం ఇతర సరుకులు సరఫరా అవుతాయి. అయితే విద్యార్థులకు అవసరానికి మించి రేషన్ కావాలని ముందుగానే నమోదు సదరు వ్యక్తులు చేసుకుంటారు. అనంతరం గోడౌన్ వద్ద సంబంధిత సిబ్బందితో వేలిముద్రలు వేయించేసుకుంటారు. మరుసటి రోజు హాస్టళ్లకు అవసరమైన బస్తాను పంపించి, మిగిలినవి గోడౌన్లోనే దాచిపెడుతున్నట్లు తెలుస్తోంది. అనంతరం సదరు బినామీ వచ్చి ఆ బియ్యాన్ని తిరుపతి రూరల్ మండలంలోని ఓ ఇంట్లో నిల్వ చేసి విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అవినీతి అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.



చంద్రగిరి పౌర సరఫరాల గోడౌన్‌లో నిల్వ చేసిన రేషన్ బియ్యం



హాస్టళ్లకు రేషన్ బియ్యం అందిస్తున్న దృశ్యం



లారీ నుంచి గోడౌన్‌లోకి రేషన్ బియ్యం తరలిస్తున్న హమాలీలు

డ్రైనేజీలో చెత్త వేస్తే జరిమానా



మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా : నగరంలోని డ్రైనేజీల్లో ఎవరైనా చెత్త వేస్తే జరిమానా విధించాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. మంగళవారం ఉదయం సప్తగిరి నగర, యశోదానగర్, ప్రశాంత్ నగర్, రైల్వే కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా భూగర్భ డ్రైనేజీ కాలువలు ఓవర్ ఫ్లో అవుతున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం వేయడం వల్లే ఓవర్‌ఫ్లో అవుతున్నాయని వెల్లడించారు. దీనిపై ప్రజలు అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి సేతుమాధవ్ పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా తిరుమల పరిరక్షణ

తిరుపతి కల్చరల్ : టీటీడీ, రెవెన్యూ, పంచాయతీ అధికారుల వ్యవహారశైలి కారణంగా తిరుమల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారిందని తిరుమల పరిరక్షణ సైన్యం ప్రతినిధులు కోలా లక్ష్మీపతి, పి.భాస్కర్ ఆరోపించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. కొండపై ఇష్టారాజ్యంగా తీసుకుంటున్న నిర్ణయాలతో స్థానికులుగా తమ ప్రశాంతత దెబ్బతింటోందని మండిపడ్డారు. రాజకీయ ఒత్తిళ్లతో అనధికారికంగా తట్టలు, దుకాణాలు పెట్టిస్తూ దోచుకుంటున్నారని విమర్శించారు. సమావేశంలో వేలు, ప్రహ్లాద, వరప్రసాద్, వెంకటేశ్వర్లు, సురేష్, బాలాజీ, నాగరాజు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే సహించం

తిరుపతి తుడా : రుయాలో సిబ్బంది అవినీతికి పాల్పడితే సహించే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తప్పవని ఆస్పత్రి అధికారులు స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్రప్రభుత్వం ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా చేపట్టిన ప్రజాభిప్రాయసేకరణలో రుయాలో అవినీతి, అపరిశుభ్రతపై ఫిర్యాదులు అందడంతో అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. ఈ మేరకు ఆస్పత్రి సిబ్బందితో విభాగాల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసి హెచ్చరిస్తున్నారు.

ప్రైవేట్ కళాశాలలపై చర్యలకు డిమాండ్

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలోని కొన్ని ప్రైవేటు ఎంబీఏ, ఎంసీఏ, లా కళాశాలలు విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయని వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు వీసీ అప్పారావుకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి రూ.లక్షలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులకు లంచం ఇచ్చి యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు వర్సిటీ సీడీసీ డీన్‌కు ముడుపులు ఇచ్చినట్లు వస్తున్న ఆరోపణలపై తక్షణం విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం వర్సిటీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వీసీకి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

కార్మికులకు బీమా అవసరం

తిరుపతి కల్చరల్ : ట్రాన్స్‌పోర్టు రంగంలోని కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నగర శాఖ 13వ మహాసభ నిర్వహించారు. అంతకు ముందు ఆటో కార్మికులు ర్యాలీ చేపట్టారు. ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించారు. హరినాథరెడ్డి మాట్లాడుతూ ఆటో కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు మార్చి 4వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నేతలు పురుషోత్తంరెడ్డి, ఎస్.శివ, రాధాకృష్ణ, చంద్రశేఖర్, కేవై.రాజా, ఎన్‌డీ.రవి, మురళి, సురేష్, వెంకటేష్, భూపాల్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న హరినాథరెడ్డి

ఆరోపణలు అవాస్తవం

తిరుపతి సిటీ : ప్రైవేటు కళాశాల నుంచి లంచం తీసుకున్నట్లు కొందరు వ్యక్తులు, విద్యార్థి సంఘాలు చేసిన ఆరోపణలు అవాస్తవమని ఎస్వీయూ సీడీసీ డీన్ చంద్రాయుడు మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రసారమాధ్యమాలలో తనపై వచ్చిన వార్తలు సత్యదూరమని తెలిపారు


అవగాహనతో క్యాన్సర్ నిర్మూలన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తిరుపతి కల్చరల్ : అవగాహనతో క్యాన్సర్ నిర్మూలించవచ్చని టాటా ట్రస్ట్ డాక్టర్ వెంకయ్యబాబు తెలిపారు. మంగళవారం సత్యనారాయణపురం రాస్ కార్యాలయంలో మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను జయించవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో క్యాంప్ కో–ఆర్డినేటర్ హేమంత్, రాస్ సిబ్బంది కె.నాగేశ్వరరావు, ఎల్.బాలాజీ, మాధవి పాల్గొన్నారు.

కామన్ పీజీ సెట్ రద్దుకు డిమాండ్



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాలు

తిరుపతి సిటీ : కామన్ పీజీ సెట్ రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు పద్మావతి మహిళా వర్సిటీ ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వర్సిటీలను ప్రైవేట్ పరం చేసేందుకు యత్నిస్తే ప్రతిఘటన తప్పదని స్పష్టం చేశారు. నేతలు మల్లికార్జున, ప్రవీణ్, అక్బర్, అశోక్, చిన్న, ఆషా, శివశంకర్ నాయక్, తిరుమలేష్, సుందరరాజు, కుమార్, మహేంద్ర నాయక్, వినోద్, ప్రవీణ్, ఉదయ్, వేణు, ఓమ్ రాజ్ , చంద్రానాయక్ , శివ బాలాజీ, నరేంద్ర పాల్గొన్నారు

రౌడీషీటర్ల బైండోవర్

తిరుపతి క్రైమ్ : శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా నలుగురు రౌడీ షీటర్లను బైండోవర్ చేసినట్లు వెస్ట్ సీఐ మురళీమోహన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ చర్యలో భాగంగా పసుపులేటి వినయ్, శివ, మల్లికార్జున, నరసింహను బైండోవర్ చేశామని వివరించారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నపత్రాలు



ప్రశ్నపత్రాలను భద్రపరుస్తున్న అధ్యాపకులు

చంద్రగిరి : ఇంటర్ ప్రశ్నపత్రాలు మంగళవారం చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాయి. మూడు సెంట్ల ప్రశ్నపత్రాలను విజయవాడ నుంచి కస్టోడియన్ అమరేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వచ్చాయి. ప్రత్యేకమైన బాక్సుల్లో భద్రపరిచారు. కార్యక్రమంలో చీఫ్ సూపర్‌వైజర్లు సుబ్బరాయుడు, రమేష్, సంధ్య, శారద, ఉషశ్రీ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



క్రీడాకారులతో దివాకర్ రెడ్డి

తిరుపతి రూరల్ : రాష్ట్రస్థాయి అండర్–14 బాల బాలికల బేస్‌బాల్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన పెరుమాళ్లపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను డాలర్స్ గ్రూప్ అధినేత దివాకర్‌రెడ్డి అభినందించారు. మంగళవారం ఈ మేరకు పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. క్రీడాకారులకు తన వంతు చేయూతనందిస్తానని వెల్లడించారు. అనంతరం టీషర్ట్‌లను పంపిణీ చేశారు.

రుయా దాతలకు పన్ను మినహాయింపు

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రికి ఆర్థిక సహాయం అందించే దాతలకు పన్ను మినహాయింపునకు మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేషన్ ఎఫైర్స్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంగళవారం ఈ మేరకు అనుమతి పత్రాలు రుయాకు అందాయి. ఇప్పటి వరకు రుయా ఆసుపత్రికి దాతలకు పన్ను మినహాయింపు లేకపోవడంతో చాలామంది ముందుకు రావడం లేదు. పారిశ్రామికవేత్తలు, వైద్య విలువను గుర్తించి తరచూ పెద్ద స్థాయిలో ఆర్థిక సాయం చేస్తుంటారు. అనేకమంది రుయాకు విరాళాలు అందించేందుకు ఆసక్తి చూపినా పన్ను మినహాయింపు లేకపోవడంతో వెనుకడుగు వేస్తూ వచ్చారు. ఏడాదిన్నర క్రితం రుయా అధికారులు పన్ను మినహాయింపును కోరుతూ మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేషన్ ఎఫైర్స్‌కు నివేదిక పంపింది. ఇప్పటికి అనుమతి రావడంతో రుయా అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.